విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386     85220 22029

Land Line No : 08517 224194



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం

Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 04 సంచిక : 18 | గురువారం 02-05-2024 | పేజీలు :04 వెల:రూ.2.00


# రాజ్యాంగం రద్దుకు బిజెపి కుట్ర



**రిజర్వేషన్ల రద్దుకూ కుట్రలు**

**పూర్తి ఆధారాలు నా వద్ద ఉన్నాయి**

**నా గడ్డమీదకు వచ్చి నన్నే బెదిరిస్తారా**

**కెసిఆర్ బెదిరింపులకే లొంగలేదు**

**గుజరాత్ వాళ్లకు లొంగుతానా**

**జగిత్యాల జనజాతర సభలో మోడీపై రేవంత్ నిప్పులు**

జగిత్యాల,మే1: దేశంలో రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన దగ్గర ఉన్నాయని సాయంత్రం 4 గంటలకు ప్రెస్ మీట్ పెట్టి చెబుతానని తెలిపారు. దేశంలో బీజేపీ రిజర్వేషన్లు తీసేయాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. కులగణనకు మోదీ ఒప్పుకోలేదని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని తెలిపారు. దేశ సంపదను మోదీ, అదానీ, అంబానీలకు దోచి పెట్టారని ఆరోపించారు. కోరుట్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు కాంగ్రెస్ న్యాయం చేయాలని చూస్తుందని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చేందుకే బీజేపీ 400 వందల సీట్లు అంటుందని ఆరోపించారు. ప్రశ్నించినందుకు తనపై మోదీ అమిత్ షా కుట్ర చేశారని చెప్పారు. ఢిల్లీలో కేంద్ర హోం శాఖ తనపై కేసు పెట్టిందని తెలిపారు. ఈడీ, సీబీఐతో పాటు ఢిల్లీ పోలీసులు తమని భయపెట్టాలని చూస్తున్నారని, గతంలో కేసీఆర్ నూ ఇలాగే భయపడితే జనం బుద్ధి చెప్పారని అన్నారు. ఢిల్లీలో పోలీసులు, సీబీఐ ఉండొచ్చుని తన దగ్గర 4 కోట్ల మంది ప్రజలు ఉన్నారని తెలిపారు. తనను అరెస్టు చేయడానికి మీకు పీఎం పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. మొదటిసారి సీఎం అయ్యాను పీఎంకు గౌరవం ఇస్తానని వెల్లడించారు. మెట్రో రైలు, మూసీ ప్రక్షాలనకు నిధులు ఇవ్వండని అడిగితే అణా పైసా ఇవ్వలేదని, హైదరాబాద్‌కు కృష్ణా జలాలు అదనంగా అడిగితే ఇయ్యలేదని విమర్శించారు. పార్లమెంట్ లో మోదీ తెలంగాణను అవమానించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజల అండతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు గతం కంటే భిన్నమన్నారు. ఇవి ఆషామాషీ ఎన్నికలు కావని అన్నారు. ప్రజలపై స్వారీ చేసేందుకు బిజెపి రెడీగా ఉందని హెచ్చరించారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని భాజపా, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో 400 స్థానాల్లో గెలవాలని భాజపా చూస్తోందని.. తద్వారా దేశాన్ని అమ్మేయాలని భావిస్తోందని వ్యాఖ్యానించారు. బలహీన వర్గాలకు దక్కాల్సిన అవకాశాలు, నిధులు రాలేదు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ఇచ్చింది. రిజర్వేషన్లు రద్దు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎటు వెళ్లాలి. ఈ అంశంపై నేను ప్రశ్నించా. మోదీ, అమిత్‌షా నాపై పగబట్టి దిల్లీలో కేసు పెట్టారు. ఈడీ, సీబీఐ, ఐటీతోనే కాదు.. దిల్లీ పోలీసులతో భయపెట్టాలని చూస్తున్నారు. కేసులకు రేవంత్ భయపడడు. చర్లపల్లి జైలుకు కేసీఆర్ పంపితే తిరగబడి కొట్లాడాం. మీ దగ్గర సీబీఐ, ఈడీ, పోలీసులు ఉండొచ్చు.. నా వెంట 4 కోట్ల తెలంగాణ ప్రజలున్నారు. మోదీ గుజరాత్ వ్యక్తిలా వచ్చి మనల్ని తిట్టారు.. శపించారు. ఐదు రోజుల్లో ఇస్తామన్న పసుపు బోర్డు ఐదేళ్లయినా ఇవ్వలేదు. 20 ఏళ్ల నుంచి ఎన్నో ఆటుపోట్లు చూశా. గుజరాత్ నుంచి వచ్చి తెలంగాణలో పెత్తనం చేద్దామనుకుంటున్నారు. తెలంగాణ పౌరుషానికి, గుజరాత్ ఆధిపత్యానికి మధ్య ఈ ఎన్నికల్లో పోటీ జరుగుతోందని అన్నారు.. ప్రెస్ మీట్ పెట్టి భాజపా కుట్రలు బయటపెడతా. రాజ్యాంగాన్ని ఎలా మార్చాలని చూస్తోందో వివరిస్తా. రాజ్యాంగం మార్పు అంశాన్ని రాష్ట్రపతి ప్రసంగంలోనే చేర్చారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలు వెల్లడిస్తా. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కొనసాగించాలని చెప్పినందుకు నాపై కేసా గుజరాత్ నుంచి వచ్చి నా రాష్ట్ర నడిగడ్డపై నిలబడి సీఎంను బెదిరిస్తారా? మోదీ భయపెడితే బెదరడానికి ఇక్కడెవరూ లేరు అని రేవంత్ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు రెండు రోజుల క్రితం సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రి అమిత్ షా డీప్ ఫేక్ వీడియో కేసులో భాగంగా సీఎం రేవంత్‌కు సమన్లు జారీ చేశారు. మే 1వ తేదీన హాజరుకావాల్సిందిగా ఢిల్లీ పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై రేవంత్‌రెడ్డి మరోసారి మోదీ ప్రభుత్వానికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఢిల్లీ పోలీసులతో తనను భయపెడుతున్నారని రేవంత్ మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ గతంలో కేసులు పెట్టినా తాను లొంగలేదని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లొంగబోనని స్పష్టం చేశారు. కేసీఆర్ జైలుకు పంపినా భయ పడలేదని అన్నారు. మోదీ కనుసన్నల్లో నాలుగు కోట్ల ప్రజల ఆశీస్సులు ఉన్నాయన్నారు. తమ ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ రద్దు చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ముక్తా భారత్ అంటే తెలంగాణను అవమానించడమేనని చెప్పారు. బీజేపీ బండారం బయట పెడుతానని హెచ్చరించారు. ఎన్నికల్లో జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎంపిగా గెలిపించాలని కోరారు. జనజాతర సభలో మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఎంపి అభ్యర్థి జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుస్తాం

**బిజెపికి పెరుగుతున్న ప్రజామద్దతు**

**కాచిగూడ ప్రచారంలో కిషన్ రెడ్డి**

హైదరాబాద్,మే1: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మెజారిటీ సీట్లు గెలిచేది బీజేపీనే అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ప్రజా మద్దతు రోజురోజుకీ పెరుగు తోందన్నారు. సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తున్న ఆయన.. బుధవారంనాడు కాచిగూడలో గల్లీగల్లీ తిరుగుతూ ఇంటింటి ప్రచారం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో రేవంత్, కేసీఆర్ తొండాట ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. చీప్ ట్రిక్స్‌తో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రేవంత్ మాటలను ఇప్పుడు తెలంగాణ ప్రజలు నమ్మడం లేదన్నారు. దేశానికి సంబంధించిన ఈ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి మాటలను ప్రజలు పట్టించుకోరన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, మోదీకే ఓటు వేస్తామని రాష్ట్రంలోని చాలా గ్రామాల్లో ప్రజలు ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని అన్నారు. సెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. మోసపూరితమైన ఆరు గ్యారెంటీల కాంగ్రెస్ బండారాన్ని ప్రజలు గమనించారని, ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజల వద్దకు వెళ్తున్న నాయకులను నిలదీస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలపై అడిగితే తాను మాట్లాడలేనని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. దొంగ వీడియోలతో బీజేపీ ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని, ఓడిపోతామని భయంతో కాంగ్రెస్ ఈ విధంగా నీచానికి దిగజారిందని మండిపడ్డారు. దళిత, గిరిజన, బీసీలతోపాటు అగ్రవర్ణాల పేదల గురించి ఎలాంటి అవాకులు చెవాకులు పేలినా సహించేది లేదని హెచ్చరించారు.



# మోదీ నిర్వాకంతో నిరుద్యోగం తీవ్రతరం : ప్రియాంక గాంధీ

ప్రజా సమస్యలను విస్మరించి సొంత ప్రయోజనాలకే మోదీ సర్కార్ ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. అసోంలోని ధుబ్రిలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కాషాయ పార్టీపై విరుచుకుపడ్డారు. కాషాయ పాలకులు ప్రజల ఇబ్బందులు పట్టించుకోరని, ఇవాళ నిరుద్యోగం అత్యధికంగా ఉందని, యువత ఉద్యోగాలు లేక తీవ్ర సమస్యలతో సతమతమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 70 కోట్ల మంది నిరుద్యోగంతో బాధపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించని మోదీ సర్కార్ సమాజంలో విభజన చిచ్చు రేపుతోందని మండిపడ్డారు. విపక్ష కూటమి అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.



# కాంగ్రెస్ పార్టీని ప్రజలే రద్దు చేస్తారు : రాజ్‌నాథ్ సింగ్

లోక్‌సభ ఎన్నికల రెండు దశల పోలింగ్ అనంతరం బీజేపీ 400 స్థానాలు గెలుచుకోవాలనే తమ నినాదం నిజమవుతుందని స్పష్టమైందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్రం లభించిన వెంటనే కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాలని మహాత్మ గాంధీ చేసిన సూచనలను కాంగ్రెస్ పెడచెవిన పెట్టిందని రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. కానీ ఇప్పుడు ప్రజలే కాంగ్రెస్ పార్టీని తుడిచిపెట్టేస్తారని అన్నారు. ఢిల్లీలోని అన్ని స్థానాలను కాషాయ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈశాన్య ఢిల్లీ నుంచి బీజేపీ అభ్యర్థి మనోజ్ తివారీ నామినేషన్ కార్యక్రమానికి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాజ్‌నాథ్ సింగ్ హాజరవడం తనకు ఆశీర్వాదంగా భావిస్తానని మనీష్ తివారీ పేర్కొన్నారు. 2019లోనూ రాజ్‌నాథ్ సింగ్ తన వెంట ఉన్నారని, అప్పట్లో తన మెజారిటీ 1.5 లక్షల నుంచి 3.75 లక్షలకు పెరిగిందని, ఈసారి మరింత భారీ మెజారిటీతో తాను గెలుపొందుతాననే నమ్మకం ఉందని తివారీ అన్నారు.



# సికింద్రాబాద్‌లో బంపర్ మెజార్టీ

**కాంగ్రెస్ గ్యారెంటీలే గెలిపిస్తాయి**

**బిఆర్ఎస్‌లో స్వేచ్ఛను కోల్పోయా**

**అంజన్‌కుమార్‌తో కలసి ప్రచారంలో దానం**



హైదరాబాద్,మే1: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై నమ్మకంతో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సికింద్రాబాద్‌లో గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానన్నారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తన గెలుపునకు దోహదపడతాయని అన్నారు. దానం బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బాకారం బొమ్మలగుడిలో పూజలు చేసి జీపుయాత్ర చేస్తూ పలు బస్తీల్లో ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. రిసాలగడ్డ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌ల మోసపూరిత మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలు, హక్కుల కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు దానంకు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని సూచించారు. ప్రచారంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆర్. కల్పనా యాదవ్, వాజిద్ హుస్సేన్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ జుహేర్ హుస్సేన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిలు కె. గౌరీశంకర్, పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బుధవారం సనత్‌నగర్ డివిజన్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయమని, రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. మతతత్వ బీజేపీ, అవినీతి బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ హయాంలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, నిరుద్యోగం గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగిందన్నారు. రైతుల ఆదాయం డబుల్ చేస్తానన్న బీజేపీ రైతు చట్టాలు తీసుకువచ్చి వారిని మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, డాక్టర్ రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నరేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్‌లో ఉండగా కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించుకోలేకపోయాననిదానం నాగేందర్ అన్నారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో పలు బస్తీలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, దీపా, గోపాల్‌నాయక్‌తో పాటు సుమారు మూడు వందల మంది దానం సమక్షంలో బుధవారం కాంగ్రెస్ లో చేరారు. వారందరికి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో ఉండగా స్వేచ్ఛ కోల్పోయినట్టు చెప్పారు. ఏడున్నర సంవత్సరాల వ్యవధిలో కేసీఆర్‌ను కలిసింది ఐదుసార్లు మాత్రమేనని, కేటీఆర్‌ను కలిసింది కూడా తక్కువేనని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ పదవులు కూడా ఇప్పించలేని పరిస్థితులు ఎదుర్కొన్నట్టు వివరించారు. కాంగ్రెస్?లో చేరిన తర్వాత స్వేచ్ఛ లభించిం దన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకే తాను పార్టీలో చేరినట్టు చెప్పారు.

# కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేయగలరా

**సిఎం రేవంత్‌వి వ్యర్థ ప్రయత్నాలు**

**తెలంగాణ భవన్ మేడు వేడుకల్లో కెటిఆర్**

హైదరాబాద్,మే1: తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే తెలంగాణనే లేకుండా చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలంటే రేవంత్ రెడ్డి వల్ల కాదు.. ఆయన జేజమ్మ వల్ల కూడా కాదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మే డే వేడుకల్లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. చెమటబొట్టే చరిత్రకు ఆధారం అని అలిశెట్టి ప్రభాకర్ అన్నారు. శ్రామికులే చరిత్ర నిర్మాతలు.. కార్మికులే సంపద సృష్టికర్తలు.. శ్రమైన జీవన సౌందర్యానికి సమానమైనది ఏది లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కార్మికవర్గం నిర్వహించిన పాత్ర ఎనలేనిది. సకల జనుల సమ్మెలో సింగరేణి కార్మికులు జంగ్ సైరన్ చేయడంతో విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. వారు తమ సత్తా చాటారు. ఆ తర్వాత ఆర్టీసీ కార్మికులు నిరవధికంగా అండగా నిలిచారు. పబ్లిక్ సెక్టార్‌లో పని చేసే కార్మికులు కూడా తమ విధులను బహిష్కరించి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు అని కేటీఆర్ గుర్తు చేశారు. అనేక పోరాటాల తర్వాత తెలంగాణ సాధించుకున్నాం. సాధించుకున్న తెలంగాణలో అద్భుతాలు జరిగాయి. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తా అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలంటే రేవంత్ రెడ్డి వల్ల కాదు.. ఆయన జేజమ్మ వల్ల కూడా కాదు. చిన్నచితకా పని చేయలేదు. కాళేశ్వరం నిర్మించాం. కాళేశ్వరం నిర్మాణంలో వేలాది మంది కార్మికుల శ్రమ ఉంది. తాజ్‌మహల్‌ను తలదన్నేలా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నిర్మించాం. అందులోనూ మన కార్మికుల శ్రమ ఉంది. అద్భుతమైన యాదాద్రి నిర్మాణంలో వందలాది కార్మికుల శ్రమ ఇమిడి ఉంది. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలంటే కాళేశ్వరం కూల్చేయాలి. యాదాద్రి ఆలయం, సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి వాటిని కూల్చేయాలని కేటీఆర్ తెలిపారు. వీటన్నింటికి మించి తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే తెలంగాణనే లేకుండా చేయాలి. ఎందుకంటే తెలంగాణ అంటేనే గుర్తొచ్చేది కేసీఆర్. ఇక ఈయన మళ్లా తన పాత బాస్‌తో మాట్లాడుకుని అటుఇటు చేసి కలుపుకుంటే తప్ప కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసే సత్తా రేవంత్ రెడ్డికి కానీ ఆయన ప్రభుత్వానికి గానీ లేదు. ఆ విషయంలో మనకు రెండో అభిప్రాయం అవసరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.



శ్రీ ప్రస్థానం

## సంపాదకీయం

# ఈవీఎంలపై సుప్రీం తీర్పుతో స్పష్టత

కొన్ని 'ఈవీఎం'ల విషయంలో ఓట్ల ట్యాంపరింగ్ జరుగుతోందని, ఆ ఈవీఎం మెషన్‌లలో ఏ పార్టీ గుర్తు మీట నొక్కినా అధికార పార్టీ గుర్తుకే ఓట్లు పోల్ అవుతున్నాయని సుప్రీంకోర్టు న్యాయవాదులు చాలా కాలం నుండి అనేక ధర్మ సందేహాలను లేవనెత్తారు. ఈవీఎంల పనితీరుపై గందరగోళాన్ని తొలగించేందుకు మరింత స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈవీఎంలు, వీవీప్యాట్లు, మైక్రోకంట్రోలర్‌కు సంబంధించి ఐదు సందేహాలను ధర్మాసనం లేవనెత్తింది. వీటికి ఎన్నికల కమిషన్ అధికారులు బదులివ్వగా, తీర్పును వాయిదా చేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. ఈవీఎంలలో పోలైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించడం ద్వారా సరిపోల్చాలని దాఖలైన పిటిషన్లను బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్లను ఏప్రిల్ 18న విచారించిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం తీర్పు ఇవ్వాల్సి ఉండగా.. ఈవీఎంల పనితీరుపై మరిన్ని సందేహాలు ఉన్నందున ముందుగా స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఈవీఎంల పనితీరును ఇప్పటికే ఎన్నికల కమిషన్ అధికారులు కోర్టుకు నివేదించగా.. ఐదు సందేహాలను కోర్టు లేవనెత్తింది. 'మైక్రోకంట్రోలర్ కంట్రోలింగ్ యూనిట్‌లో ఉంటుందా? వీవీప్యాట్‌లో ఉంటుందా? అని ప్రశ్నించింది. మైక్రోకంట్రోలర్ ఒకసారి మాత్రమే ప్రోగ్రామ్ చేసేదేనని నిర్ధారిస్తారా ? సింబల్ లోడింగ్ యూనిట్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయి? అని ఈసీని అడిగింది. ఈవీఎంలను 30 రోజులు భద్రపరుస్తారా? 45 రోజులా? తదితర సందేహాలపై స్పష్టత ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈవీఎంలలో సాంకేతిక అంశాలలో తలెత్తే సమస్యల నివృత్తి కోసం వారు పోరాటం చేస్తూ చివరకు న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ పిటిషన్‌పై చాలా కాలం గడిచాక మొన్న సుప్రీంకోర్టు తన తీర్పును వెల్లడించింది. అయితే, ఈ తీర్పులో ప్రజల్లో గల అనేక సందేహాలను, న్యాయవాదులు లేవనెత్తిన అనేక సాంకేతిక అంశాలను సుప్రీంకోర్టు పట్టించుకోకపోవడంతో అనేక ధర్మ సందేహాలు అలాగే మిగిలిపోయాయి. ఇటీవల కేరళలో ఈవీఎంల సామర్థ్యాన్ని నిరూపించడానికి ఒక ప్రయోగం నిర్వహించారు. అందులోనూ ఒక మీట నొక్కితే ఓటు మరొకరికి పడిన సాక్ష్యం వెల్లడైంది. అందుకే ఇలాంటి సాంకేతిక లోపాలను సరిదిద్దడానికి, ఈవీఎంలకు అనుసంధానమై ఉండే వీవీ ప్యాట్ పత్రాలన్నింటిని బేరీజు వేయాలని, లేదా పాత పద్ధతిలో బ్యాలెట్ పత్రాలను వినియోగించాలని, అదీ వీలుకాకపోతే, వీవీ ప్యాట్లలో ఏడు సెకండ్లు మాత్రమే వెలిగే కాంతిని ఎప్పుడూ వెలిగేలా చేయాలని న్యాయవాదులు సుప్రీంకోర్టులో కేసులు వేశారు. అయితే న్యాయవాదుల వాదనలు, ఇతర ప్రజా సంఘాలు చేసిన విజ్ఞప్తులను దేనిని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజీవ్ కన్నా, దీపాంకర్ దత్తతో కూడిన బెంచ్ ఆమోదించలేదు. ఈ కేసులన్నింటినీ సుప్రీంకోర్టు గంపగుత్తగా కొట్టివేసింది. దీంతో ఈ అంశంపై ప్రజల ప్రశ్నలు, ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. సుప్రీం బెంచ్ విచారణ సమయంలో, ఆధునిక సాంకేతికత ఆధారంగా తయారైన ఈవీఎంల మీద అనుమానాలు వ్యక్తం చేసే ధోరణి సరైనది కాదు, పైగా ఎన్నికల కమిషన్ కూడా రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ కనుక తాము ఆదేశాలు ఇవ్వలేమనడం ఆశ్చర్యం కలిగించింది. సుప్రీంకోర్టే ఈ విషయంలో జోక్యం చేసుకోకపోతే దాని అవకతవకలను ఎవరు నిలువరించ గలరు? ఎన్నికల కమిషన్ తప్పు చేయదని నిర్ధారించడం ఎలా సమర్థనీయం? కార్యనిర్వాహక వర్గం ప్రభావంతో ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా వ్యవహరించనప్పుడు, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా లేనప్పుడు ఓటర్లు ఎవరికి మొర పెట్టుకోవాలి? ఈవీఎంల పనితీరులో ఓటర్లకు సందేహాలు కలిగినప్పుడు వాటిని పరిష్కరించవలసిన బాధ్యత ఈసీకి లేదా? ఎన్నికల కమిషన్ అంతర్గత విషయాల్లో సమున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోలేమంటే ఓటర్లు ఎవరిని ఆశ్రయించాలి? అసలు ఎన్నికల సంఘం విధుల్లో జ్యోక్యం చేసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు లేదని న్యాయమూర్తులు నిర్ధారణకు వచ్చినప్పుడు కేసు ప్రాథమిక దశలోనే న్యాయవాదుల పిటిషన్లను తిరస్కరించకుండా ఇంతకాలం ఎందుకు వాదనలు, ప్రతివాదనలు జరిపారు? ఇది విలువైన కోర్టు సమయం వృథా చేయటమేగా? పోనీ, వీవీపాట్ల నుండి వెలువడే చిన్న ఓటర్ స్లిప్పులను ఓటరు చేతికి ఇస్తే అతడు చూసుకొని ఒక డబ్బాలో వేసే అవకాశం కల్పించాలన్న సూచనలను కూడా న్యాయమూర్తులు అంగీకరించలేదు. వాటిని లెక్కించడం మొదలుపెడితే దానికి వారం రోజుల సమయం పడుతుంది కనుక దాన్ని సైతం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈవీఎం అనే పరికరం ఒకసారి మాత్రమే ప్రోగ్రాం చేసేది కాదు. దాని ఫలితాలను సాంకేతికంగా తారుమారు చేసే వీలు ఉందని, ఇది కేరళలలో రుజువైందని, ప్రసిద్ధ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వాదనలను కూడా సరైన కారణాలు చెప్పకుండానే సుప్రీంకోర్టు నిరాకరించింది. కావాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో ఈవీఎం పనితీరును, ట్యాంపరింగ్ అవకాశాలను సాంకేతిక నిపుణుల ముందు, జర్నలిస్టుల ముందు పరీక్షకు ఆదేశాలు ఇవ్వొచ్చు కదా! కానీ, కోర్టు అలా చేయలేదు. ఈవీఎంలలోని లోపాలను లేవనెత్తడం అంటే... ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యతిరేకించడమేనని ఎన్నికల సంఘం వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. మనుషుల ప్రమేయం లేని యంత్రాలు కచ్చితంగా ఫలితాలు అందిస్తాయని న్యాయమూర్తులు... ఈవీఎంలను సాంకేతికంగా సాఫ్ట్‌వేర్ సహాయంతో మార్పులు చేయవచ్చునన్న వాదనను కోర్టు అంగీకరించకపోవడం, మనిషి తయారు చేసిన పరికరాన్ని ఆ మనుషులే మార్చవచ్చునన్న తర్కాన్ని కోర్టు ఎందుకు పట్టించుకోలేదో తెలియదు.

# ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 60కిపైగా పాఠశాలలకు బాంబు బెదిరింపులు.. ఉలిక్కిపడ్డ రాజధాని ప్రాంతం

దేశంలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల క్రితం దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దేశరాజధాని ఢిల్లీ లోని సుమారు 50 పాఠశాలలకు బుధవారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోని పలు ప్రముఖ స్కూళ్లకు బుధవారం ఉదయం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. రాజధానిలోని ద్వారక, వసంత్ కుంజ్, తూర్పు మయూర్ విహార్‌లోని మదర్ మేరీ స్కూల్, సంస్కృతి స్కూల్, పుష్ప విహార్‌లోని అమిటీ స్కూల్, సౌత్ వెస్ట్ ఢిల్లీలోని డీపీఎస్ స్కూల్స్‌కు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.




అదేవిధంగా నోయిడాలోని సుమారు 12 పాఠశాలలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో పాఠశాలలకు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు మెయిల్స్ పంపినట్లు చెప్పారు. దీంతో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బందిని ఇంటికి పంపించేశారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. అయితే, అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలూ వారికి కనిపించలేదు. దీంతో కేసు నమోదు చేసుకొని ఈమెయిల్ ఐపీ అడ్రస్ ద్వారా ఆగంతకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకేసారి ఇన్నిపాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడంతో రాజధాని ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మరోవైపు ఈ బాంబు బెదిరింపులపై ఢిల్లీ మంత్రి అతిషీ స్పందించారు. ఢిల్లీ పోలీసులు, పాఠశాల అధికారులతో ప్రభుత్వ అధికారులు నిరంతరం టచ్‌లో ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ భయపడొద్దని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఈరోజు ఉదయం కొన్ని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విద్యార్థులను వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయించారు. ఆయా పాఠశాలల ప్రాంగణాల్లో ఢిల్లీ పోలీసులు సోదాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ పాఠశాలలోనూ ఎలాంటి పేలుడు పదార్థాలూ లభ్యం కాలేదు. మేము పోలీసులు, పాఠశాలల యాజమాన్యాలతో నిరంతరం టచ్‌లో ఉన్నాము. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు భయపడొద్దు' అని అతిషీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. కాగా, దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా చెన్నై, ముంబైలోని పలు పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ఢిల్లీలో పలు స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. పోలీసులు తనిఖీలు చేపట్టగా ఎలాంటి పేలుడు పదార్థాలూ లభించలేదు. దీంతో అది నకిలీ బెదిరింపు అయి ఉంటుందని పోలీసులు అప్పట్లోనే వెల్లడించారు. అంతేకాదు, పలు విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఇలా దేశంలోని పలు పాఠశాలలు, ప్రముఖ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి వరుస బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.

# మాయమవుతున్న గుండ్లపోచంపల్లి రాతిచిత్రాలు

మెదక్, మే 1 (న్యూస్ పల్స్) మెదక్ జిల్లాలోని గుండ్లపోచంపల్లి సమీపంలో రాతి చిత్రాలను గుర్తించారు. రియల్ ఎస్టేట్ విస్తరణతో ఈ తరహా రాతిచిత్రాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని చరిత్రకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ కు 25 కి.మీ.ల దూరంలో కొంపెల్లి గ్రామానికి చేరువలోవున్న గుండ్లపోచంపల్లికి 2 కి.మీ. దూరంలో ప్రభుత్వ అటవీ భూముల అంచున 3శిలాశ్రయాలలో కొత్తగా రాతిచిత్రాలు కనుగొనబడ్డాయి. ఈ చిత్రిత శిలాశ్రయాలు భౌగోళికంగా 17.5820 డిగ్రీల అక్షాంశాలు, 78.4617 డిగ్రీల రేఖాంశాలపై, సముద్రమట్టానికి 545మీ.ల ఎత్తున వున్నాయి. గుండ్లపోచంపల్లికి చెందిన సాయికృష్ణ, దక్కన్ యూనివర్సిటీ చారిత్రక పరిశోధక విద్యార్థి, యువ ఇంజనీర్ (ప్రస్తుతం ఏఎస్పైలో ఉద్యోగి, డాక్టరేటు సాధించాడు.) చరిత్రపై ఆసక్తితో తన అన్వేషణను తన ఊరి నుంచే మొదలుపెట్టి సఫలీకృతంగా ఈ మూడు చిత్రితశిలాశ్రయాలను కనుగొన్నాడు. కొత్త తెలంగాణ చరిత్ర బృందాన్ని తమ గ్రామానికి ఆహ్వానించి మాకు వాటిని చూపించాడు. ఈ చారిత్రక యాత్రలో చరిత్ర బృందం యొక్క సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణ, బెల్లంకొండ సంపత్ కుమార్, ఫారెస్ట్ గార్డ్, సాయికృష్ణ తోడుగా రాతి చిత్రాలు పరిశీలించారు. మొదటిలో మధ్యశిలాయుగం, నవీన శిలాయుగం సంధికాలానికి చెందిన రాతి చిత్రాలున్నాయి. చాలా అందంగా చిత్రించిన ఎరుపురంగు అడవిదున్నల చిత్రాలు ఆధునిక చిత్రకారుల పెయింటింగ్సునే సవాలు చేసేంత గొప్పగా కళాత్మకంగా వున్నాయి. రెండడుగుల ఎత్తు, మూడడుగుల పొడవున్న ఈ చిత్రాలు తెలంగాణ పూర్వయుగ చరిత్రకు కొత్తపేజీలు. ఇక్కడే కొన్ని రాతిపనిముట్లు లభించాయి. వాటిలో బూమరాంగు వంటి వంపుగల రాతిపనిముట్టు, పెచ్చురాళ్ళతో ఒకవైపు చెక్కిన గొడ్డళ్ళు, బొరిగెలవంటివి, రాతికత్తులు, మరొక నునుపైన రెండువైపులచెక్కిన రాతిగొడ్డలిముక్క (నవీనశిలా యుగానికి చెందినది)ఉన్నాయి. రెండవ శిలారాయి చాలా ముఖ్యమైనది. ఎక్కువ చిత్రాలు వేర్వేరుకాలాల్లో ఒకదానిపై మరొకసారి గీసిన రాతి చిత్రాలు చాలా వున్నాయి. ఒకచోట అందమైన మొదటి శిలాశ్రయంలోని అడవిదున్నలతో పోలికలున్నచిత్రణతో మూపురమున్న ద్విశూలం వంటి వంపు కొమ్ములతో ఒక ఎద్దు ఉంది. ఇక దాని పక్కన గొప్ప చిత్రకారుని చేతిలో రూపుదిద్దుకున్న చిత్రం వంటి రెండెద్దులబొమ్మ, ఒక ఎద్దు వెనక మరొక ఎద్దు వాటి కొమ్ములు మధ్యలో అగుపిస్తుంటాయి. అదొక జమిలి ఎద్దుల బొమ్మ లెక్క కనిపిస్తుంది. వీటికి దగ్గరలో ఒక దుప్పిబొమ్మ చిత్రించిన తీరు మనోహరంగా ఉంది. ఈ పెద్ద చిత్రాల కాన్వాసులో మరొకచోట సన్నని గీతల ఏనుగు బొమ్మవుండడం విశేషం. మెదక్ జిల్లా అస్తలాపూర్ తర్వాత ఏనుగు కనిపించడం ఇక్కడే. చిత్రాల అంచులతో అంతటా ఈటెలు,తాళ్ళవలలు ధరించిన వేటగాళ్ళబృందాలు కనిపిస్తున్నాయి. అవి కొంచెం ఎక్కువగా అయి వున్నాయి. ఇంకొక చోట సామూహికనృత్యం చేస్తున్న ముగ్గురు ఆదిమానవుల దృశ్యం గొప్పచిత్రం. వాళ్ళ పక్కన పడివున్న జంతుదేహాలు కనిపిస్తున్నాయి. ఈ శిలాశ్రయం వద్ద పరిశోధన జరిపితే ఆదిమానవుల పనిముట్లు దొరికే అవకాశముంది. మొదటి శిలాశ్రయం 10 అడుగుల ఎత్తు లోపలే వుంది. ఈ రెండో శిలాశ్రయం 20 అడుగుల ఎత్తులో వుంది. మూడో శిలాశ్రయంలో రాతిచిత్రాలన్నీ మాసిపోయివున్నాయి. పెద్దవి, పొడవైన కొమ్ములున్న మగజింక(ఇర్రి)వంటి జంతువు చిత్రించబడి వుంది. మరికొన్ని జింకలవంటి అస్పష్టచిత్రాలు అక్కడ అగుపిస్తున్నాయి. ఈ శిలాశ్రయం 30 అడుగుల ఎత్తులో వుంది. ఈ చిత్రిత శిలాశ్రయాలు మూడుయుగాల ప్రతినిధులు. మూడో శిలాశ్రయం ప్రాచీనశిలాయుగానికి, మధ్యశిలాయుగానికి కూడా చెందినది. ఇక్కడి బొద్దుగీతల బొమ్మలు చాలా రఫ్ గా వున్నాయి.

అంత ఎత్తున ఆదిమానవుల నివాసమున్నది మధ్యశిలాయుగాలకు ముందుననే. దట్టమైన అడవిలో క్రూర జంతువులనుండి రక్షణకై ఇంత ఎత్తులలో వుండడం సహజంగా మధ్యశిలాయుగంనాటి లక్షణం. రెండవ శిలాశ్రయంలోని బొమ్మలు రెండుతరాలకు చెందినవిగా అగుపిస్తున్నాయి. సన్నని గీతలబొమ్మలు, వీటిలో ఆడవాళ్ళ బొమ్మలు లేవు. వేట దృశ్యాలు వీటి ప్రత్యేకత. చాల్కోలిథిక్ పీరియడ్లో వేసిన బొమ్మల వలె జననేంద్రియాల చిత్రణ లేదు వీటిలోవేసిన బొమ్మల మీదనే బొమ్మలు వేసివున్నాయంటే తర,తరాలుగా ఆదివాసుల ఆవాసంగా ఈ ప్రదేశముండివుంటుంది. రెండోతరం బొమ్మలన్నీ, కళాత్మకత వుట్టిపడుతున్నాయి. రెండెద్దుల బొమ్మలోని చిత్రకళానైపుణ్యం ఆదిమానవుల ఈస్థటిక్సుని తెలియచేస్తున్నది. మొదటి శిలాశ్రయం రాతిపనిముట్లవల్ల మధ్యశిలాయుగానిదని, రాతిచిత్రాల వల్ల నవీనశిలాయుగానిదని తెలుస్తున్నది. ఒకేచోట ఆదిమానవుల సాంస్కృతిక వైభవాన్ని చూడగలగడం ఒక అద్భుతం, అపూర్వం. రోజురోజుకూ రియల్ ఎస్టేట్ విస్తరణ సాగుతుండటంతో ఈ తరహా రాత్రి చిత్రాలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వీటి రక్షణ కోసం కేంద్రమంత్రి నుంచి స్థానిక రెవెన్యూ అధికారుల వరకు విజ్ఞప్తులు చేసినా ఫలితం మాత్రం శూన్యంగా ఉందని వాపోయారు.

# భువనగిరలో క్రాస్ ఓటింగ్ టెన్షన్...

నల్గొండ, మే 1(న్యూస్ పల్స్) తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు రక్తి కడుతున్నాయి. ఇటీవల ఓ బహిరంగ సభలో టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి ఓ ఆరోపణ చేశారు. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో కనీసం నాలుగు చోట్ల బీఆర్ఎస్, బీజేపీతో కుమ్మక్కయ్యింది. ఆ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు బీఆర్ఎస్ తెరవెనుక సహకారం అందిస్తోంది. దీనికోసం తమ పార్టీ నుంచి డమ్మీ అభ్యర్థులను బరిలోకి దింపింది అన్నది ఆ సంచలన ఆరోపణ. కానీ, బీఆర్ఎస్ వైపు నుంచి ఈ ఆరోపణలను తిప్పికొట్టే ప్రయత్నం పెద్దగా ఏదీ జరగలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఇలా చేసిన ఆరోపణల్లోని నాలుగు లోక్ సభా నియోజకవర్గాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని భువనగిరి పార్లమెంటు స్థానం ఒకటి. భువనగిరి ఎంపీ సీటు విషయంలో బీఆర్ఎస్ చేతులు ఎత్తేసిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థి ఎంపిక నుంచి మొదలు.. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం దాకా బీఆర్ఎస్ లో పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నియోజకవర్గంలో ఇప్పటికే రోడ్ షో కూడా జరిపి ప్రచారం చేసినా, కేడర్ లో జోష్ నింపడంలో కేసీఆర్ పర్యటన పెద్దగా ఉపయోగపడలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సీటు నుంచి టికెట్ ఆశించిన తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలక్రిష్ణారెడ్డికి టికెట్ ఇచ్చి ఉంటే, 2014 విజయం సాధించిన సీటును తిరిగి దక్కించుకునేందుకు అవకాశం ఉండేదని, కనీసం గట్టి పోటీ ఇవ్వగలిగేదన్న విశ్లేషణలు ఉన్నాయి. కానీ, ఎంపీ సీటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇబ్రహీంపట్నం మినహా మిగిలిన ఆరు సెగ్మెంట్లకు ఏమాత్రం పరిచయం లేదని క్యామ మల్లేష్ యాదవ్ కు టికెట్ ఇవ్వడంతో ముందే ఓటమిని అంగీకరించిందా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారంలో, ఓటర్లను కలుసుకోవడంలో, పర్యటనల్లో వెనకబడి ఉన్నారు. ఆయనకు సహకరిస్తున్న నియోజకవర్గ నాయకత్వం కూడా పెద్దగా లేదు. దీంతో ఎక్కడా బీఆర్ఎస్ ప్రచార హవా కనిపించడం లేదు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక జనగామలోనే పార్టీ ఎమ్మెల్యేగా ఉండగా, ఆలేరు, భువనగిరి, ఇబ్రహీంపట్నం, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల మెజారిటీనే ఏకంగా 2.73 లక్షలు కావడం గమనార్హం. 18 లక్షల దాకా ఓట్లున్న భువనగిరి ఎంపీ సీటును దక్కించుకోవాలంటే పోలైన ఓట్లలో కనీసం 6 లక్షల మార్కు చేరుకోవాలన్న అంచనాలు ఉన్నాయి. భువనగిరి ఎంపీ సీటును దక్కించుకున్న బీఆర్ఎస్ కు 4.48 లక్షలు ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన ఆ పార్టీకి 5.27 లక్షలు వచ్చాయి. ఈ సారి కనీసం 6లక్షల పైచిలుకు ఓట్లు వస్తే గెలిచే అవకాశాలు తక్కువ. ఇప్పటికే పోటీ బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్య జరుగుతుందని బాగా ప్రచారం అయిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఒక విధంగా ఆత్మరక్షణలో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ ఎమ్మెల్యేలు ఉండడం వంటి కాంగ్రెస్ కు పాజిటివ్ అంశాలు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తుందని, మోడీ మూడో సారి ప్రధాని అవుతారని మోడీ చరిష్మాపై ఆధారపడుతున్న బీజేపీ అంచనాల్లేకుండా బరిలోకి దిగినా ప్రచారంలో ఊపుమీదుంది. బీజేపీ అభ్యర్థి 2014లో ఎంపీగా గెలిచి ఉండడం, 2019 లో స్వల్ప ఓట్ల తేడాతోనే ఓడిపోయి ఉండడం, ఎంపీ నియోజకవర్గంలో పరిచయాలు బాగా కలిగి ఉండడం బీజేపీకి పాజిటివ్ అంశాలుగా ఉన్నాయి. కానీ, బీఆర్ఎస్ కు అనుకూలమైన వాతావరణమే లేదన్న అభిప్రాయం బలంగా ఉంది. ఈ ఎన్నికల్లో భువనగిరిలో వెనుకబడిపోయినట్లు కనిపిస్తున్న బీఆర్ఎస్ ఓట్లు బీజేపీ అభ్యర్థికి క్రాస్ అవుతాయన్న ప్రచారం రెండు మూడు రోజులుగా ఊపందుకుంది. బీజేపీ అభ్యర్థి గతంలో బీఆర్ఎస్ కు చెందిన వాడు కావడం, వర్గం గౌడ్లకు అత్యధిక ఓట్లు ఉండడం, బీఆర్ఎస్ అభ్యర్థికి నియోజకవర్గంలో పెద్దగా ఎక్స్ పోజర్ లేకపోవడం, కాంగ్రెస్ ను నిలవరించడానికి బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ప్రచారం జరుగుతోంది. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ కు ఉన్న బీఆర్ఎస్ లో ఉన్న వ్యక్తిగత పరిచయాలతో ఆయన అన్ని పార్టీల్లోని తమ సామాజిక వర్గానికి చెందిన వారిని, మాజీ పార్టీలోని సంబంధాలను ఇప్పటికీ కొనసాగిస్తుండడంతో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ లోని ఒక వర్గం పార్టీతో నిమిత్తం లేకుండా బూర నర్సయ్య గౌడ్ సహకరిస్తుందన్న ప్రచారం నేపథ్యంలో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి క్రాస్ అవుతాయన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్ : బృందా కారత్




మేడే సందర్భంగా మోదీ సర్కార్‌పై సీపీఎం నేత బృందా కారత్ బుధవారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని బీజేపీ పాలకుల దమనకాండపై ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆమె అభ్యర్థించారు. మోదీ ప్రభుత్వం కార్మికుల పొట్టకొడుతూ వారి హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. కార్మికులకు మేలు చేయని కాషాయ ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతోందని అన్నారు. పదేండ్ల తన పాలన కేవలం ట్రైలర్ మాత్రమేనని పూర్తి సినిమా ముందుందని ప్రధాని మోదీ చెబుతున్నారని అన్నారు. తమ హక్కులను పూర్తిగా కాలరాసిన పాలన ట్రైలర్ అయితే ఇక రాబోయే రోజుల్లో ఏం జరగుతుందో తలుచుకుంటేనే భయం వేస్తోందని వ్యవసాయ కార్మికులు చెబుతు

# ఆదిలాబాద్ జిల్లాలో రచ్చకెక్కిన కాంగ్రెస్ రాజకీయాలు



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ రాజకీయాలు రచ్చకెక్కాయి. ఆ పార్టీల చేరికలు వర్గపోరుకు దారితీశాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించిన మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిత్ ఖాన్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డిలను తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. కాగా, వీరి చేరికలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన బాటపట్టాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి కారణమైన ముగ్గురు నాయకులను చేర్చుకోవద్దంటూ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి వర్గీయులు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ద్రోహులను పార్టీ నుంచి బహిష్కరించాలని నినదించారు. వారి చేరికలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. హైకమాండ్ నిర్ణయం మార్చుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# దండకారణ్యం లో కాల్పుల మోత

రాయ్ పూర్, మే 1 ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. కాంకేర్, నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నక్సల్స్ పెద్ద సంఖ్యలో హతమయ్యారు. 2 వారాల వ్యవధిలో ఈ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరగడం ఇది రెండోసారి. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని తెక్‌మేట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నక్కినట్లు పోలీసులకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో స్పెషల్ టాస్క్ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గ్రూప్ డీఆర్‌జీ దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. గాలింపు చేస్తూ నక్సల్స్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నాయి. వీరిని చూసి మావోయిస్టులు కాల్పులు జరిపారు. భద్రతా దళాల ఎదురు కాల్పుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోయారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు.

# రిజర్వేషన్లపై కర్పూరీ ఠాకూర్‌తో విభేదిస్తున్న మోదీ : తేజస్వి యాదవ్

రిజర్వేషన్ల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీకి సమాచార లోపం ఉందని ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ అన్నారు. ప్రధాని మోదీ కర్పూరీ ఠాకూర్‌ను భారత రత్నతో గౌరవించారని, అయితే కర్పూరీ ఠాకూర్ అభిప్రాయాలను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. కర్పూరీ ఠాకూర్ తొలిసారి సీఎం పదవి చేపట్టిన వెంటనే సామాజికంగా వెనుకబడిన కులాలన్నింటికీ వారి మతాలతో నిమిత్తం లేకుండా తొలిసారిగా రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. కర్పూరీ ఠాకూర్ నిర్ణయాన్ని తప్పు అని చెప్పడం సరైనదేనా అని ప్రశ్నించారు. ఇక రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, విపక్ష ఇండియా కూటమి మధ్య డైలాగ్ వార్ క్లైమాక్స్‌కు చేరింది. మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపడితే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని కాంగ్రెస్ సహా విపక్ష నేతలు ప్రచారం సాగిస్తుండగా రిజర్వేషన్లను తొలగించే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ సహా కాషాయ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు.








# సలార్ 2.. ఈ ప్లాన్ లో ఏ మార్పు లేదు!



ప్రభాస్ నెక్స్ట్ కల్కి సినిమాతో పాన్ వరల్డ్ రేంజ్ లో సక్సెస్ అందుకోవడానికి సిద్ధమవుతున్నాడు. అశ్వినీదత్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ హడావిడి కూడా మొదలైపోయింది. మొత్తానికి విడుదల డేట్ పై కూడా క్లారిటీ ఇచ్చేశారు. జూన్లో పక్క ప్రణాళికతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అయితే డైరెక్టర్ ప్రశాంత్ నీల్ - ప్రభాస్ సలార్ సీక్వెల్ ను కూడా వీలైనంత తొందరగా స్టార్ట్ చేయబోతున్నట్లు గతంలోనే ఒక క్లారిటీ వచ్చేసింది. సినిమాలో నటించిన చాలామంది కూడా ఏప్రిల్ లోనే సినిమా స్టార్ట్ అయిపోతుంది అన్నట్లుగా మాట్లాడారు. కానీ దర్శకుడు ప్రశాంత్ మాత్రం ఆ విషయంలో పెద్దగా స్పందించలేదు. ఎందుకంటే ప్రభాస్ కల్కి సినిమాకు ఫినిషింగ్ టచ్ ఇచ్చి ఆ సినిమా విడుదల వరకు ప్రమోషన్స్ లో బిజీగా ఉంటాడు. అందుకే ప్రశాంత్ నీల్ కూడా సలార్ 2 పనులు స్టార్ట్ అయితే చేయలేదు. దీంతో ఈ విషయంపై చాలా రకాల గాసిప్స్ అయితే పుట్టుకొచ్చాయి. ప్రశాంత్ ప్రభాస్ కోసం ఎదురు చూడకుండా ముందుగా ఎన్టీఆర్ సినిమాను పట్టాలు ఎక్కించే అవకాశం ఉందని కూడా కొన్ని కథనాలు వెలువడ్డాయి. ప్రభాస్ కల్కి తర్వాత రాజా సాబ్, హను రాఘవపూడి సినిమాలతో బిజీ అయ్యే అవకాశం ఉంది అని అందుకే ఈ లోపు ఎన్టీఆర్ సినిమాను మొదలు పెట్టవచ్చని వివిధ రకాల రూమర్స్ అయితే వచ్చాయి. అయితే ఇప్పుడు లేటెస్ట్ గా అందుతున్న సమాచారం ప్రకారం అయితే అందులో ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. ఎన్టీఆర్ ప్రాజెక్టు మొదలవ్వాలి అంటే ముందు ఎన్టీఆర్ డేట్స్ దొరకాలి. ప్రస్తుతం బాలీవుడ్ వార్ ప్రాజెక్టులో బిజీగా ఉన్న ఎన్టీఆర్ ఆ తర్వాత మళ్ళీ దేవర షూటింగ్ కు ఫినిషింగ్ టచ్ ఇవ్వాల్సి ఉంది. కాబట్టి అతను ఇప్పట్లో దొరికే అవకాశం లేదు. అంతేకాకుండా సలార్ 2 కూడా వీలైనంత తొందరగా ప్రేక్షకుల ముందు తేవాల్సిన అవసరం ఉంది. దీన్ని ఆలస్యం చేస్తే బజ్ తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి సలార్ 2 సినిమాను కల్కి వచ్చిన తర్వాత వెంటనే మొదలుపెట్టే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. కల్కి రిలీజ్ అనంతరం ఒక ఐదు రోజులపాటు రెస్ట్ తీసుకోబోతున్న ప్రభాస్ సలార్ 2 ప్రాజెక్టును సెప్టెంబర్ మొదట్లోనే స్టార్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దర్శకుడు మొదటి షెడ్యూల్ కు సంబంధించిన ప్రణాళికను కూడా రచించాడని సమాచారం.

# థై థండర్ షోస్‌తో గుండెలు మరిగించింది!

లో తొలి అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. ఇంతలోనే పాపులర్ బ్రాండ్లు తన వెంట క్యూ కడుతున్నాయి. భారీ కాంట్రాక్టులను కుదుర్చుకుంటున్నాయి. తాజా సమాచారం మేరకు సుహానా ప్రఖ్యాత లక్స్ బ్రాండ్ కి సంతకం చేసింది. తన తండ్రి అడుగుజాడల్లో బాలీవుడ్ రాయల్టీ షారుఖ్ ఖాన్ - గౌరీ ఖాన్ జంట కుమార్తె సుహానా ఖాన్ లక్స్ 100 ఇయర్స్ ఈవెంట్‌లో అబ్బురపరిచింది. ఇటీవలే



ఈ బ్రాండ్ తమ కొత్త అంబాసిడర్‌గా సుహానా పేరును ప్రకటించింది. ఈ సందర్భంగా సుహానా పబ్లిక్ అప్పియరెన్స్ గుండెల్ని మరిగించింది. ముఖ్యంగా పర్పుల్ కలర్ గౌనుతో రెడ్ కార్పెట్ పై హ్వాయలు పోయింది ఈ కుర్రబ్యూటీ. సుహానా తీరైన రూపం.. డార్క్ బ్లూ కలర్ ఫిగర్-హగ్గింగ్ సిల్హౌట్ డ్రెస్ సుహానా లో హాట్ నెస్ ని మరింత పెంచాయి. సుహానా మేకప్ కూడా ఎంతో సింపుల్ గా ఉంది. ఇందులో ఐలైనర్, మెరిసే ఐషాడో, బెర్రీ-టోన్డ్ లిప్ షేడ్ ఆకర్షిస్తున్నాయి. లక్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా సుహానా అరంగేట్రం కెరీర్‌లో ఒక ముఖ్యమైన ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది ఆరంభం మాత్రమే. ముందుంది ముసళ్ల పండగ అనే సిగ్నల్స్ కూడా ఇస్తోంది. నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్ 'ది ఆర్చీస్'లో అద్భుత నటనతో ఆకట్టుకుంది సుహానా. ఇక పెద్ద తెర ఆరంగేట్రానికి సుహానా ఎంతో పకడ్బందీ వ్యూహం రచించారని తెలుస్తోంది. షారూక్ తో కలిసి ఒక యాక్షన్ చిత్రంలో సుహానా నటించనుందని కథనాలొస్తున్నాయి. తాజా ఫోటోషూట్ లో పర్ఫెక్ట్ ఫిట్ లుక్ హైలైట్ అయింది. సుహానా థై సొగసుల ఎలివేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగుల ప్రపంచంలో ఫ్లెక్సిబిలిటీ పెద్ద ప్లస్. సుహానాకు వర్ధమాన తారగా మంచి భవిష్యత్ ఉందని అంచనా వేస్తున్నారు.

# రెబల్ స్టార్ నుంచి ఫ్యాన్స్ అది కోరుతున్నారు..!


స్టార్ హీరోలు తమ ఫ్యాన్స్ ను మెప్పించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కేవలం తమ యాక్టింగ్ తోనే కాదు వారి ఫ్యాన్స్ తమ నుంచి కోరుకునే అంశాల్లో కూడా వారు అదరగొట్టేస్తున్నారు. తెలుగు హీరోల్లో చిరంజీవి తర్వాత ఆ రేంజ్ డ్యాన్స్ చేస్తూ డ్యాన్స్ లో వీళ్లకు తిరుగు లేదని అనిపించుకుంటున్నారు ఎన్.టి.ఆర్, అల్లు అర్జున్, రాం చరణ్. ఈ ముగ్గురు హీరోల సినిమాల్లో వారి యాక్షన్ తో పాటుగా డ్యాన్స్ కూడా ఫ్యాన్స్ కు ఐ ఫీస్ట్ అందిస్తుంది. అయితే వీరికి ఈక్వల్ రేంజ్ అంతకన్నా ఎక్కువ ఫ్యాన్ బేస్ ఉన్న ప్రభాస్, మహేష్ లు మాత్రం డ్యాన్స్ విషయంలో అంత సీరియస్ గా ఉండరు. ఏదో సినిమాకు సాంగ్స్ అవసరం కాబట్టి చేసేద్దాం అన్నట్టు వారి ఆలోచన ఉంటుంది. బ్రహ్మోత్సవం సినిమా టైం లో అయితే మహేష్ తన డ్యాన్స్ మూమెంట్స్ తో విపరీతంగా ట్రోల్స్ కు గురయ్యాడు. ఆర్జీవి కూడా మహేష్ ని టార్గెట్ చేస్తూ ట్వీట్లు వేశాడు. అలాంటి మహేష్ కుర్చీ మడతపెట్టి అంటూ డ్యాన్స్ అదరగొట్టేశాడు. మహేష్ డ్యాన్స్ చేస్తే చూడాలని అనుకున్న సూపర్ స్టార్ ఫ్యాన్స్ కోరిక తీరింది. అయితే ఇప్పుడు రెబల్ స్టార్ ఫ్యాన్స్ కూడా ప్రభాస్ మంచి డ్యాన్స్ నెంబర్ వేస్తే చూడాలని అనుకుంటున్నారు. ఫ్యాన్స్ కోసం ఏదైనా చేసే ప్రభాస్ నెక్స్ట్ సినిమాలో ఒక మంచి డ్యాన్స్ నెంబర్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. మారుతి డైరెక్షన్ లో ప్రభాస్ హీరోగా వస్తున్న రాజా సాబ్ సినిమాలో ప్రభాస్ డ్యాన్స్ తో కూడా మెప్పిస్తాడని అంటున్నారు. ప్రభాస్ కూడా డ్యాన్స్ చేయడం మొదలు పెడితే



స్టార్స్ మధ్య ఫైట్ మరింత టఫ్ గా మారే ఛాన్స్ ఉంటుంది. అయితే డ్యాన్స్ లో ఎవరి స్టైల్ వారిది. ఒకరు వేసినట్టు మరొకరు వేయాలన్న రూల్ ఏమి లేదు. మహేష్ కెరీర్ లోనే కుర్చీ మడతపెట్టి అనేది బెస్ట్ అనిపించింది. అలానే ప్రభాస్ కూడా డ్యాన్స్ లో తన బెస్ట్ ఇస్తే చూడాలని రెబల్ స్టార్ ఫ్యాన్స్ కోరుతున్నారు. నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో వస్తున్న కల్కి 2898 ఏడి సినిమా జూన్ 27న రిలీజ్ లాక్ చేయగా రాజా సాబ్ సినిమాను 2025 సంక్రాంతికి తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు సినిమాలతో ప్రభాస్ మరోసారి తన బాక్సాఫీస్ స్టామినా చూపించాలని ఫిక్స్ అయ్యారని చెప్పొచ్చు.

# కళ్ళవాపు, చర్మ సమస్యలు.. నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలకు ముప్పు.. ఎలాగంటే!!

మూత్రపిండాలు.. మన శరీరంలో ముఖ్యమైన అవయవాలు. మూత్రపిండాలు సరిగ్గా పనిచేస్తేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. మూత్రపిండాలు శరీరం నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను, అదనపు ద్రవాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉంటాయి. మన రక్తంలోకి మలినాలు చేరకుండా కాపాడతాయి. మన కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటేనే మనం శారీరకంగా ఆరోగ్యంగా ఉంటాం. ఒక్కొక్కసారి కిడ్నీల సమస్యలు మనకు శరీరంలోని ఇతర లక్షణాల ద్వారా బయటకు వస్తాయి. మన కిడ్నీలకు, మన కళ్ళకు, చర్మానికి లింక్ ఉంటుందన్న విషయం చాలామందికి తెలియదు. కానీ కళ్ళకు సంబంధించిన, చర్మానికి సంబంధించి కొన్ని లక్షణాలు మన కిడ్నీ సమస్యను చెప్పకనే చెబుతాయి. కిడ్నీ సమస్య ఏమైనా మూత్ర విసర్జన లేదా కడుపు నొప్పికి సంబంధించిన లక్షణాలకే పరిమితం కాదు. మూత్రపిండాల సమస్యల కారణంగా మనకు అనేక చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కిడ్నీలు సరిగ్గా పని చేయనప్పుడు చర్మం పొడిబారటం, పొరలు పొరలుగా మారడం, దురదగా అనిపించడం సంభవిస్తుంది. కాబట్టి చర్మం పై ఇటువంటి లక్షణాలు కనిపిస్తే డెర్మటాలజిస్ట్ ను సంప్రదించడంతోపాటు మూత్రపిండాలను కూడా పరీక్ష చేయించుకోవడం అవసరం. చర్మ సమస్యలు



మాత్రమే కాదు, మూత్రపిండాలలో ఎటువంటి సమస్యలు ఉన్న కళ్ళకు సంబంధించిన అనారోగ్యం కూడా వస్తుంది. మీ కళ్ళ చుట్టూ వాపు అనిపిస్తే, కంటి పరీక్షల తర్వాత కూడా స్పష్టమైన కారణం తెలియకపోతే కచ్చితంగా కిడ్నీల అన్ని చెక్ చేయించుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు వైద్యనిపుణులు. కిడ్నీల సమస్య ఉత్పన్నమైతే అనేక ఇతర అనారోగ్య సమస్యలు కూడా కలుగుతాయని చెబుతున్నారు. కండరాల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తరచుగా యూరినరీ ఇన్ఫెక్షన్స్, కాళ్ళల్లో వాపు వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఏ లక్షణాలు కనిపించినా, కిడ్నీలకు సంబంధించి చిన్న అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి ఆదిలోనే ఆ సమస్యకు చెక్ పెట్టాలి. సమస్య తీవ్రమైన తర్వాత, కిడ్నీలు పూర్తిగా పాడైపోయిన తర్వాత వైద్యులు కూడా ఏమి చేయలేని పరిస్థితి వస్తుంది. కాబట్టి కిడ్నీల ఆరోగ్యం విషయంలో తస్మాత్ జాగ్రత్త.

# ఆరోగ్యంగా, ఫిట్ గా ఉండాలంటే ఎలాంటి షార్ట్ కట్ లు ఉండవు!!

చాలామంది ఆరోగ్యంగా ఉండాలని ఫిజికల్ గా ఫిట్ గా ఉండాలని కోరుకుంటారు. కానీ అందుకు కావలసిన జీవన విధానాన్ని మాత్రం అనుసరించరు. ఫలితంగా అనారోగ్యం బారిన పడతారు. ఆరోగ్యం కోసం ఏం చేసినా అది షార్ట్ టర్మ్ మాత్రమే చేస్తారు. కొద్ది రోజులు జిమ్ చేయడం, కొద్ది రోజులు యోగ చేయడం, కొద్దిరోజులు డైట్ ఫాలో చేయడం.. ఇలా చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే, శారీరకంగా ఫిట్ గా ఉండాలంటే క్రమబద్ధమైన జీవన విధానం ఉండాలి అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆరోగ్యం కోసం ఎటువంటి షార్ట్ కట్ లు ఉండవు. కచ్చితంగా ఎప్పుడు పాటించవలసిన నియమాలే ఉంటాయి. ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. ప్రతిరోజు కనీసం ఒక గంట పాటు వ్యాయామం చేయాలి. గంటసేపు వ్యాయామం చేయడం కుదరకపోతే కనీసం అరగంట సేపైనా తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు సమయం ప్రకారం ఆహారాన్ని తినాలి. ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ, ఏది పడితే అది తినడం మంచిది కాదు. సమయం ప్రకారం మంచి పౌష్టికాహారాన్ని తినాలి. అన్ని పోషకాలు ఉన్న ఆహారంపై అవగాహన ఉండాలి. అలాంటి ఆహారమే తీసుకోవాలి.

# ఆ బ్యానర్ లో విజయ్ సినిమా ఏమైనట్టు..?



మొదటి రెండు సినిమాలతోనే తన టాలెంట్ చూపించి రౌడీ స్టార్ ఇమేజ్ తెచ్చుకున్న విజయ్ దేవరకొండ తన కెపాసిటీకి తగిన కథలు పడట్లేదని చెప్పొచ్చు. అఫ్కోర్స్ కథల సెలక్షన్ లో విజయ్ దేవరకొండ పడుతున్న కన్ ఫ్యూజన్ అతని సినిమాల ఫలితాలతో తెలుస్తుంది. అర్జున్ రెడ్డితో తనకంటూ ఒక మాస్ ఫాలోయింగ్ ఏర్పరచుకున్న విజయ్ దేవరకొండ ఆ తర్వాత సినిమాలైతే చేస్తున్నాడు కానీ ఇది తన టాలెంట్ అని ప్రూవ్ చేసుకున్నది లేదు. ఒక సాలిడ్ హిట్ తో కంబ్యాక్ ఇవ్వాలని ప్రయత్నిస్తున్న విజయ్ దేవరకొండకు నిరాశే మిగులుతుంది. విజయ్ దేవరకొండ రీసెంట్ మూవీ ద ఫ్యామిలీ స్టార్ కూడా డిజప్పాయింట్ చేసింది. దిల్ రాజు బ్యానర్ లో పరశురాం డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా అంచనాలను అందుకోలేకపోయింది. ఫ్యామిలీ స్టార్ తర్వాత విజయ్ సితార బ్యానర్ లో గౌతం తిన్ననూరితో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా విషయంలో చాలా జాగ్రత్త వహిస్తున్నట్టు తెలుస్తుంది. స్పై థ్రిల్లర్ గా రాబోతున్న ఈ సినిమా రౌడీ స్టార్ ఫ్యాన్స్ ని సాటిస్ఫై చేస్తుందని అంటున్నారు. ఇక ఈ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ మళ్లీ దిల్ రాజు బ్యానర్ లోనే సినిమా చేస్తాడని తెలుస్తుంది. రవికిరణ్ డైరెక్షన్ లో ఈ సినిమా వస్తుంది. అయితే విజయ్ తో గీతా ఆర్ట్స్ బ్యానర్ లో సినిమా చేయాలని అల్లు అరవింద్ అనుకున్నారు. పరశురామ్ డైరెక్షన్ లోనే ఆ సినిమా చేయాలని అనుకున్నా అక్కడ కాదని వచ్చి దిల్ రాజుతో సినిమా చేశాడు పరశురాం. డైరెక్టర్ తో ఎలాగు ఇక మీదట చేయకూడదని అనుకున్న గీతా ఆర్ట్స్ హీరోతో కూడా సినిమా చేసేందుకు ముందుకు రావట్లేదు. అయితే విజయ్ మాత్రం మంచి కథతో వస్తే గీతా ఆర్ట్స్ లో సినిమా చేసేందుకు ఆసక్తిగా ఉన్నాడు. గీతా గోవిందం లాంటి హిట్ ఇచ్చిన గీతా ఆర్ట్స్ లో విజయ్ సినిమా చేసేందుకు సుముఖంగానే ఉన్నాడు. మరి ఆ బ్యానర్ లో విజయ్ దేవరకొండ సినిమా ఎప్పుడు ఉంటుంది అన్నది చూడాలి. విజయ్ నెక్స్ట్ రెండు సినిమాలు మిస్ అవ్వగా తర్వాత అయినా ఈ కాంబో కుదురుతుందేమో చూడాలి. ప్రస్తుతం గీతా ఆర్ట్స్ 2 లో నాగ చైతన్యతో తండేల్ సినిమా వస్తుంది.

# ధోనీ వల్ల కాదు.. అతని వల్లే భారత్‌కు వరల్డ్ కప్- గంభీర్

మరో నెల రోజుల్లో టీ20 మహా సమరం ప్రారంభం కానుంది. అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. 2007లో మొదలైన ఈ పొట్టి కప్ సమరంలో భారత్ తొలి విజేతగా నిలిచింది. సీనియర్లు లేకుండా మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యంలో వెళ్లిన యువ టీమిండియా ఛాంపియన్‌గా నిలిచింది. పసికూనలా బరిలోకి దిగిన భారత్ సమష్టిగా సత్తాచాటి విశ్వ విజేతగా నిలిచింది. అయితే టీమిండియా ప్రపంచకప్ గెలవడానికి ధోనీ కెప్టెన్సీ, ఫైనల్‌లో గౌతమ్ గంభీర్ స్పెషల్ ఇన్నింగ్స్, ఇర్ఫాన్ పఠాన్ అద్భుత బౌలింగ్, యువరాజ్ సింగ్ సంచలన ప్రదర్శ కారణాలుగా అభిమానులు, విశ్లేషకులు చెబుతుంటారు. కానీ భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడానికి రోహిత్ శర్మ ప్రత్యేక కారణమని గంభీర్ పేర్కొన్నాడు. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో రోహిత్ ఇన్నింగ్స్ విజయంలో కీలకపాత్ర పోషించిందని తెలిపాడు. హిట్ మ్యాన్ 16 బంతుల్లో అజేయంగా 30 పరుగులు సాధించాడు. రెండు ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. "టీ20 వరల్డ్ కప్-2007 ఫైనల్లో నా ఇన్నింగ్స్, ఇర్ఫాన్ పఠాన్ గొప్ప స్పెల్ గురించి ప్రజలు మాట్లాడుతుంటారు. కానీ రోహిత్ శర్మ ఇన్నింగ్స్ తుదిపోరులో ఎంతో ప్రత్యేకమైనది. అతను సాధించిన పరుగులు టీమిండియాకు ఎంతో విలువైనవి" అని గంభీర్ పేర్కొన్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో అయిదు వికెట్లకు 157 పరుగులు చేసింది. గంభీర్ 54 బంతుల్లో 75 పరుగులు చేశాడు. అనంతర ఛేదనలో పాకిస్థాన్ 19.3 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. కాగా, తొలి టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటిన రోహిత్ శర్మ మరో టీ20 కప్‌ను భారత్‌కు అందించాలని పట్టుదలతో బరిలోకి దిగుతున్నాడు. 37 ఏళ్ల రోహిత్ శర్మ 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత మరో మెగాటోర్నీకి అందుబాటులో ఉండటం దాదాపు అనుమానమే. ఈ నేపథ్యంలో తన కెరీర్‌ను ప్రపంచకప్‌తో ఘనంగా ముగించాలని భావిస్తున్నాడు.

టీ20 వరల్డ్ కప్‌కు ఎంపిక చేసిన టీమిండియా:

రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్) సంజు శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబె, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌రిజర్వ్ ప్లేయర్లు: శుబ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేష్ ఖాన్.

# రోహిత్‌లీహార్దిక్ గొడవలే ముంబై ఓటమికి కారణం- మాజీ క్రికెటర్

ఐపీఎల్‌లో అత్యంత బలమైన జట్లలో ముంబై ఇండియన్స్ ఒక్కటి. అయిదు సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. కానీ ఐపీఎల్-2024లో మాత్రం ముంబై పేలవ ప్రదర్శన చేస్తోంది. సీజన్ ఆరంభంలో ఆలస్యంగా గెలుపు రుచి చూసిన ముంబై తాజాగా మరోసారి హ్యాట్రిక్ పరాజయాల్ని చవిచూసింది. పది మ్యాచ్‌లు ఆడిన హార్దిక్ సేన కేవలం మూడు విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నుంచి రెండో స్థానంలో నిలిచింది. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషాన్, తిలక్ వర్మ వంటి స్టార్ ప్లేయర్లు ముంబై జట్టులో ఉన్నారు. అయినప్పటికీ గెలుపురుచి చూడటానికి తీవ్రంగా కష్టాలు పడాల్సి వస్తోంది. అయితే ముంబై ఓటమికి రోహిత్-హార్దిక్ గొడవలే కారణమని ఆస్ట్రేలియా మాజీ క్రికెట్ మైకేల్ క్లార్క్ పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముంబై జట్టు గ్రూప్‌లుగా విడిపోయిందని ఆరోపించాడు

# నీల మధును గెలిపిద్దాం

- కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం
-అభివృద్ధివైపు అడుగేద్దాం
-నీలం మధునుగెలిపిద్దాం
-ఆవుల రాజిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్





**నర్సాపూర్ (ప్రస్థానం న్యూస్) :-** లోక్సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నీ భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంటుకు పంపాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, గొల్లపల్లి, లింగాపూర్, గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీసీ బిడ్డ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నీ భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించి పార్లమెంటుకు పంపే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. గత 9 సంవత్సరాలుగా బిఆర్ఎస్ పాలననీ చూసాం, తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన ప్రభుత్వాన్ని కుటుంబ పాలన వ్యవహారం తీరు రాజకీయాన్ని నడిపించారు. 9 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రజలను ఉద్ధరించిందేమీ లేదని అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రజలు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును గద్దెదించి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చి తగిన బుద్ధి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను తప్పక ఆగస్టు 15 లోపు అమలు చేస్తామని తెలిపారు. ఎంపీ అభ్యర్థి గెలిపించి కాంగ్రెస్ పార్టీని మరింత బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్ గుప్తా, మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అరుణ పతాకం ఆవిష్కరించి ప్రపంచ కార్మికులారా ఏకంకండి...



**శ్రీ ప్రస్థానం మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** అల్వాల్ జిహెచ్ఎంసి ప్రాంగణంలో మే డే ఉత్సవాలను కార్మికుల దినోత్సవం గా జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయం అరుణ పతాకం ఆవిష్కరించి ప్రపంచ కార్మికులారా ఏకంకండి మే డే వర్ధిల్లాలి అంటూ పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరైనారు భవన నిర్మాణ కార్మికులు ఆటో రిక్షా కార్మికులు రైతు బజార్ లోని చిరు వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటియుసి నిరంతరం పోరాటాలు చేస్తుందని ఎన్నికలకు అండగా ఉండి వారి హక్కులను సాధించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని కే రవిచంద్రన్ ఈ కార్యక్రమంలో జి మహేందర్ శేఖర్ పాల్గొన్నారు

## మల్కాజిగిరి పార్లమెంట్ ఎస్సీ మోర్చా నాయకులు కార్యకర్తలు వి బి ఆర్ గార్డెన్ లో సమావేశమైనారు..





**శ్రీ ప్రస్థానం మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** మల్కాజ్గిరి పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ కు అపూర్వ స్వాగతం పలికారు ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచిన ఈటల రాజేందర్ మల్కాజిగిరి పార్లమెంట్ ఎస్సీ మోర్చా విభాగానికి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు వి బి ఆర్ గార్డెన్ లో సమావేశమైనారు ముఖ్య అతిథిగా ఈటెల రాజేందర్ రాజమైనారు ఆయన మాట్లాడుతూ ఎస్సీ మరియు బలుగు బడిన వర్గాలకు అండగా ఉంటానని దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గాన్ని అత్యధిక మెజారి తో గెలిపిస్తే అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుందామని కార్యకర్తల ఉద్దేశించి అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సీ స్టేట్ జనరల్ సెక్రెటరీ క్రాంతి కిరణ్ మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు .మురళి కరుణాకర్.లవ కుమార్ .నాగరాజు .రమేష్ .యాదగిరి .జయపాల్ .మల్లికార్జున గౌడ్ .మాణిక్ రెడ్డి . అంతోని135 డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ .పద్మిని సుజాత. పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## మే డే సందర్భంగా అనిల్ కిషోర్ గౌడ్ జెండా ఎగరవేశారు..

**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** అల్వాల్, బూదేవినగర్, వెంకటాపురం డ్రైవర్స్ అసోసియేషన్ అద్వర్యం లో మే డే సందర్భంగా అనిల్ కిషోర్ గౌడ్ జెండా ఎగరవేశారు. అసోసియేషన్ సభ్యులు స్వామి,నరేష్,వెంకటయ్య,రాము, రాజు,కుమార్,రమేష్,నాగరాజు,దేవేందర్ పాల్గొన్నారు.




## ఘనంగా శ్రీలక్ష్మి ప్రత్యంగిరదేవి వార్షికోత్సవం...!



**శ్రీ ప్రస్థానం కుత్బుల్లాపూర్ రిపోర్టర్ :** శ్రీలక్ష్మి ప్రత్యంగిరదేవి వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని, ఆశీస్సులు తీసుకున్న మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి నిజాం పేట మున్సిపాలిటీ బాచుపల్లి ఐశ్వర్యాంబిక తపోవనం (త్రిశక్తి పీఠం) శ్రీలక్ష్మి ప్రత్యంగిరదేవి అమ్మవారిని,(శ్రీ వాసు దేవానంద స్వామి మరియు శ్రీ శక్త్యా నందగిరి స్వామి) ను మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గారు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కే. పి. వివేకానంద్ గౌడ్ దర్శించుకున్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ శక్తి స్వరూపిని అయిన అమ్మవారిని దర్శించడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు అష్టైశ్వర్యాలు అష్టైశ్వర్యాలు చేకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, రవికిరణ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బిత్వరలో కాంగ్రెస్ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఖాయం. అఫ్జల్ ఖాన్...





**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** శామీర్ పేట్ లో దిన దినం కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం మంచి ఊపందుకొంటుందని మాజీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ ఉద్యమ కారులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ అన్నారు. మహ్మద్ అఫ్జల్ ఖాన్ మీడియా తో మాట్లాడుతు రాష్ట్రం తో పాటు కేంద్రంలో కూడా కాంగ్రెస్ కు ప్రజల అనూహ్య మద్దతు లభిస్తోందని ఇదే తంతు కొనసాగి కాంగ్రెస్ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని అన్నారు. మంగళవారం ఇంటింటి ప్రచారం లో ముఖ్య నాయకులు మండల అధ్యక్షులు వైయస్ శంకర్ గౌడ్, మేకల మహేందర్ యాదవ్,మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, ఎంపిటిసి డపు సాయి బాబా,విలాసాగరం అశోక్, జ్యోతి, గ్రామ అద్యక్షులు ఎమ్ ఆంజనేయులు తో కలిసి అఫ్జల్ ఖాన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు మాట్లాడుతు మల్కాజ్ గిరి ఎంపి అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కి ప్రజల అనూహ్య మద్దతు లభిస్తోందని తెలిపారు. త్వరలో సునీత మహేందర్ రెడ్డి తో పెద్ద ఎత్తున కార్యక్రమం కూడా నిర్వహించటం జరుగుతుందని నాయకులు మాట్లాడుతు అన్నారు. ఇంటింటి ప్రచారం లో వీరి తో పాటు నాయకులు అరుణ్ కుమార్,సేవాదళ్ జిల్లా అద్యక్షులు మహ్మద్ షఫీయోద్దీన్,సోని, కుమ్మరి వెంకటేష్,వంగ నర్సింహా రెడ్డి, బాల్ రాం,మేడి సురేష్,వలపు ఎల్లం,సోగాడ బాల్ రాజ్ , రవిందర్, నాగరాజునందు, నిరుడు మహేందర్,యాదగిరి, మధు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గొర్రె పొటేల్ పందెం నిర్వాహకుల అరెస్ట్ ..

శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : : గొర్రె పొటేల్ పందెం నిర్వాహకులను అరెస్ట్ చేసిన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో కొందరు గొర్రె పొటేల్ పందాలను నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2 గొర్రె పొటేళ్లు, 2 ఆటోలు, 8 మందిని పోలీస్ లు అదుపులోకి తీసుకున్నారు. ఈ పందెంలో దాదాపు 27వేల రూపాయలు ఆన్లైన్ బెట్టింగ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి షామీర్పేట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ను గెలిపిస్తాయి..

**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ స్టాఫ్ రిపోర్టర్ :** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునితా మహేందర్ రెడ్డి గెలుపు లక్ష్యంగా పని చేయాలి×టీపిసిసిఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ను గెలిపిస్తాయి.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునితా మహేందర్ రెడ్డి గెలుపు లక్ష్యంగా పని చేయాలి.టీపిసిసిఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ గారి ఆధ్వర్యంలో మల్కాజిగిరి



పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్లోల సునితా మహేందర్ రెడ్డి గెలుపు లక్ష్యంగా జవహర్ నగర్ కార్పొరేషన్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగాటీపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, సీనియర్ నక్క ప్రభాకర్ గౌడ్,పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు డిపాజిట్ రాకుండా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకరదర్శి సరిత వెంకటేష్,మేయర్ శాంతి కోటేశ్వర్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్,బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి,యూత్ అధ్యక్షులు వినయ్,కార్పొరేటర్లు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు,మహిళా కాంగ్రెస్,మాజీ ప్రజా ప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## మే డే సందర్భంగా సంజీవ్‌రెడ్డి గార్డెన్‌లో జరిగిన రక్తదాన శిబిరానికి మైనంపల్లి హనుమంతరావు...





**శ్రీ ప్రస్థానం మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** జిహెచ్ఎంసి పరిధిలోని 133 డివిజన్ మాచబోలారంలో నీటి ఎద్దడి కారణంగా మంజూరైన దాదాపు 1/2 కి.మీ మేర ఐస్ ఫ్యాక్టరీ – లప్పం ఫ్యాక్టరీ వద్ద కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. కాలనీ వాసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మన్మదరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మే డే సందర్భంగా సంజీవ్‌రెడ్డి గార్డెన్‌లో జరిగిన రక్తదాన శిబిరానికి మైనంపల్లి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే, ఇంచార్జి లోక్‌సభ మేడ్చల్/మల్కాజిగిరి నియోజకవర్గం వారితో కలిసి హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు చిట్టి బాబు, రాజ్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు, జిప్ట్రానిక్స్ మెషిన్ టూల్స్ ద్వారా పవన్ కళ్యాణ్, ఆనంద్ కుమార్, రాము, సందీప్ రెడ్డి, శేషిధర్ తదితరులు పాల్గొన్నారు.. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ బూత్‌ల వారీగా కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి హాజరయ్యారు. సురేందర్ రెడ్డి, అఫ్సర్ భాయ్, సంతోష్ రెడ్డి, నవీన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కుతాడి శ్రీకాంత్, ఆధ్వర్యంలో 13 డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ చేరికలు..





**శ్రీ ప్రస్థానం మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన,జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ కుతాడి శ్రీకాంత్, ఆధ్వర్యంలో 13 డివిజన్ లో ఈరోజు కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిధిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జితోటకూర వజ్రష్ యాదవ్ హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లక్ష్మి, మేయర్ శాంతి కోటేశ్వర్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్,బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి,యూత్ అధ్యక్షులు వినయ్,కార్పొరేటర్లు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు,మహిళా కాంగ్రెస్,మాజీ ప్రజా ప్రతినిధులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల ఈటెల రాజేందర్ ని గెలిపించాలని ఇంటింటి ప్రచారం...

శ్రీ ప్రస్థానం కుత్బుల్లాపూర్ రిపోర్టర్ : మల్కాజ్గిరి పార్లమెంట్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రి నగర్ లో బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్ ని గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమం లో మహేందర్ సింగ్,కళ అచ్యుత వర్ధన్, శ్రీరాములు,విజయ భాస్కర్ రెడ్డి, శివరావు, బూపల్ , కృష్ణమూర్తి, గుండ శ్రీనివాస్, రఘుపతి రెడ్డి, ఆంజనేయ ప్రసాద్, రజినీకాంత్, బాలాజీ,పదాల మోహనరావు, వెంకటేశ్వర రెడ్డి ,వెంకట్ రెడ్డి ,ఝాన్సీ,డివిజన్ అధ్యక్షులు పులి బలరాం, శ్రీకాంత్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757